# కోరికలు

చీకటిముసుగు తొలగించుకొని, మబ్బుతెరలను తప్పించుకొని తూర్పున వెలుగురేకలు వెల్లివిరుస్తున్నాయి. దూరాన గుడిగంటలు వినబడుతున్నాయి. తెల్లారిందన్నమాట. క్రమక్రమంగా వెలుగు అధికమయ్యేకొద్దీ ఒక్కరొక్కరే ప్రయాణీకులు ఈ త్రోవనే వెడతారు.

ఇక్కడికి కనుచూపుదూరంలో ఏదో పెద్దగుడి ఉన్నది. విష్ణ్వాలయం, ఈత్రోవన వెళ్ళేవారు చెప్పుకుంటూఉంటే విన్నాను. అక్కడ ప్రతినిత్యమూ ఉత్సవమే. ఈచుట్టుప్రక్కల జనంఅంతా తెల్లవారితే అక్కడే వ్రాలతారు. అక్కడినుంచి తిరిగి వెళ్ళేటప్పుడు ఇక్కడికి వస్తారు. నాకు ప్రదక్షిణాలు చేస్తారు. పసుపు, కుంకుమ, పండ్లు ఉంచుతారు. ఏవేవో కోరికలు కోరుకుంటారు. అస్పష్టంగా కొన్ని నాకు వినబడతాయి కొన్ని వినబడవు. నా కొమ్మలక్రింద నిలబడి, నాకు ప్రదక్షిణంచేసి ఏదైనా కోరుకుంటే తప్పక నెరవేరుతుందని వారి ఆశాభావం. ఎందరి కోరికలు నెరవేరాయో నాకు తెలియదు. వచ్చినవారే మళ్ళీ వస్తారు. ఒకకోరిక తీరితే మరొకటి కోరుకుంటారు. అనంతంగా వస్తూ పోతూనే ఉంటారు. ఎవరెవరో ఎందరో నాకు సరిగా గుర్తుకూడా ఉండదు.

దూరాన ఆ గుడిదగ్గర ఎందరు చేరుతారో ఏమి ఉత్సవాలు జరుగుతాయో నాకు కనబడదు. ఆగుడికి నాకూ మధ్య ఎన్నో చెట్లు, ఎన్నో కొమ్మలు గుబురుగుబురుగా ఉన్నాయి.

ఆకుల సందులోనుంచి తళతళ మెరుస్తూ బంగారు గోపురం మాత్రం కనబడుతూంటుంది నాకు. గాలి ఎప్పుడైన విపరీతంగా వీస్తే నా ఆకులన్నీ రాలి ఎగిరి గుడి గుమ్మందాకా వెళ్ళిపడతాయి అంతే. అదే భగవంతునకు నేను చేసే పూజ.

నా ప్రక్కనే ఈ మఱ్ఱిచెట్టు ఎన్నాళ్ళగానో ఊడలు పాదుకొని భూమి అంతా వ్యాపించి పందిరి వేసినట్టున్నది. అదీ నేను ఇంచుమించు ఒకేసారి పుట్టాము. గాలికి కదులుతూ కొమ్మలు ఒరుసుకుంటూ పలకరించుకొంటూ ఒక చోటనే పెరిగాము. అదే నాకు తోడు, దానికి నేను తోడు. ఒకరి నొకరు చూస్తూ కాలం గడుపుతాము.

పగలు రాత్రి, రాత్రీ పగలూ, ఎన్నిరోజులు గడిచిపోయాయో, కొన్నివేల సంవత్సరాలు గడచినట్టనిపిస్తుంది నాకు. ఆమధ్య ఇద్దరు పిల్లలు ఈ కొమ్మలక్రింద ఆడుకొంటున్నారు. చుట్టూపడిఉన్న పండుటాకులు, పసుపూ చూస్తూ నన్నుగురించే మాట్లాడుతున్నారు. ఒకతను అన్నాడు. "రావిచెట్టు ఇక్కడ ఎన్నాళ్ళనించి ఉన్నదో తెలుసా? ఆ మఱ్ఱిచెట్టు ఈ రావిచెట్టు, ఆ వేణుగోపాలస్వామి ఆలయం కట్టకముందునించి కూడా ఉన్నాయట. అంటే సుమారు వెయ్యేళ్ళపైన అయి ఉండాలి."

రెండో అతను అన్నారు: "అవును నేనూ విన్నాను. అసలు స్వయంగా రామానుజులవారే ఈ మొక్క పాతారంటారు. అందుకే ఆచెట్టుకంత పవిత్రత. ఈచెట్టుక్రింద తలచుకొంటే ఏ కోరికలైనా తీరుతాయట."

నాకు నవ్వు వస్తుంది. ఈమాటలు నాకు కొత్తకాదు. ఎందరో, ఎన్నిసార్లో ఈమాటలే చెప్పుకుంటూ ఉంటారు. ఎన్నిసార్లో విన్నాను. ఎంత అమాయకులు. నాలో అందరి కోరికలూ తీర్చేశక్తి ఉన్నదా? నాకోరికలే తీరడంలేదు. అనంతంగా తపస్సు చేస్తున్నాను, ఆకాశాన్ని అందుకోవాలని. నా తపస్సు ఫలించలేదు. నా కొమ్మలు పైకిలేచి లేచి నాలుగు దిక్కులూ వ్యాపించాయి అంతే, ఆకాశాన్ని అందుకోలేదు. నా ఆశ ఫలించలేదు. ఎప్పటికో ఈ కోరిక ఫలిస్తుంది. ఎప్పటికో నా తపస్సు పునీతమౌతుంది. నా కొమ్మలు ఆకాశాన్ని అందుకోగలుగుతాయి. ఈ ఆశతోనే జీవిస్తున్నాను. ఇంకొక వెయ్యి సంవత్సరాలకైనా, ఈ ఆశ ఫలించాలి.

ఇదంతా అడవి. చుట్టుప్రక్కల ఎక్కడా యిళ్లులేవు. గుడికి వెళ్ళే త్రోవలో నాకు దూరంగా ఒక సాధువుల మఠం ఉన్నది. దాని వెనకాలే ఏదో నది సుళ్ళుతిరిగి ప్రవహిస్తున్నది. ఇక్కడికి వచ్చేవారంతా నదిలో స్నానంచేస్తారు. గుడిలో ఉత్సవాలు చూస్తారు. మఠానికి వెళ్లుతారు. ఆ తరువాత ఇక్కడికి వస్తారు.

ఎందరెందరో వస్తారు. రకరకాలవారు, పావడా చొక్కాలతో, పారిజాత పూలతో పెళ్ళికాని పిల్లలు వస్తారు. పసుపు బట్టలతో పారాణిలో క్రొత్తపెళ్ళికూతుళ్ళు వస్తారు. కాటుక కళ్ళలో నడికట్లతో వారే మళ్ళీ పసిపిల్లతల్లులై వస్తారు. మళ్ళా కొప్పు ముల్లతో కోడర్లలోవస్తారు, వచ్చేవారందరూ ఎక్కువగా ఆడవాళ్ళే. వారికే ఎన్నో కోరికలు. పెళ్ళికాని

పిల్లలకు మంచిభర్త కావాలి, జన్మంతా కోరికలే. ఒకే కోరికలు తరతరాలుగా.

మధ్యాహ్నం ఎండ మాడుస్తుంది. పన్నెండు గంటలకు గుడితలుపులు మూస్తారు. మదంతో భజనలు చేస్తారు. అలసిపోయినవారు నానీడన నిద్రపోతారు. కొందరు కబుర్లు చెప్పుకుంటారు. పసిపిల్లలదగ్గరనుంచి పెద్దవారయ్యే వరకూ ఎందరినో చూస్తాను. కొన్నాళ్ళకు మళ్ళావారు రారు. క్రొత్తవారు వస్తుంటారు. రోజులు గడచిపోయాయి. ఎప్పుడో నాకు నిద్రవస్తుంది. ఆవులిస్తాను. మళ్ళీ మేల్కొంటాను. కబుర్లు వింటాను.

ప్రొద్దువాలుతుంది. గుడి తలుపులు మళ్ళీ తెరుస్తారు. మంగళవాయిద్యాలు మ్రోగుతాయి మంత్రాలు వినబడతాయి. మళ్లా అంతా నిశ్శబ్దం. నల్లని మేలిముసుగులోరాత్రి అడుగు పెడుతుంది. ఆకసందులో నక్షత్రాలు మాత్రం మిగులుతాయి. మళ్ళా తెల్లవారేవరకూ మళ్లీ చప్పుడూ వుండదు.

ఈ రాత్రివేళే బాగుంటుంది. నా కొమ్మలు నిశ్చలంగా ఉంటాయి. నా ఆత్మ ప్రశాంతంగా ఉంటుంది. నా తపస్సు నిర్విఘ్నంగా సాగుతుంది.

ఎప్పుడో ఒకరోజు మాత్రం ఈ శాంతి ఉండదు. ఉరుములు, మెరుపులు, ప్రళయాన్ని రుచిచూపుతాయి. ప్రచండవాయువు వస్తుంది. కొమ్మ లల్లాడిపోతాయి. ఊడలు పాతుకొన్న ఈ మర్రిచెట్టుకూడా వణికి పోతుంది. నా వ్రేళ్లు

పెళ్ళగిలి నేను నేలకు వాలిపోతున్నా ననుకుంటాను. అంతలో వాన తగ్గిపోతుంది. ఇద్దరమూ తెప్పరిల్లుతాం.

ఇవాళ ఎవరో ఇంకా తెల్లవారకముందే వస్తున్నారు. రామలక్ష్మి సావిత్రిలా ఉన్నారు. వీళ్ళను నేను ఎరుగుదును. ఎన్నాళ్ళగానో వస్తున్నారు. ఎన్నిసంవత్సరాలైందో. చిన్న పిల్లలప్పటినుంచి వస్తున్నారు.

ఈ కొమ్మల క్రిందే వారి మొదటి పరిచయం. ఇక్కడే వారు తొలిసారి పలకరించుకున్నారు. ఆడుకొన్నారు. ఆ మొదటి మాటలు ఇంకా నాకు వినబడుతున్నాయి.

నీ పేరేమిటి?

రామలక్ష్మి. నీపేరో?

సావిత్రి. మీదేవూరు?

రాంపల్లి. మీదో?

నగపల్లె రోజూ వస్తారా?

ఆఁ. మా అమ్మవస్తే నువ్వో.

నేనూ...మా అమ్మ వస్తే...

ఆడుకుందామా?

ఏమాట?

దాగుడుమూతలు.

ఇద్దరూ నవ్వారు. అదే తొలి పరిచయం. ఆ తరువాత ఎన్నిసార్లో కలుసుకున్నారు. ఎన్నిసార్లో కలిసివచ్చారు. ఎన్ని కబుర్లో చెప్పుకున్నారు.

రామలక్ష్మి పెళ్లైన కొత్తలో వచ్చింది. సావిత్రి వచ్చింది. ఆ కబుర్లను నేను మరచిపోలేదు. రామలక్ష్మి

ఉత్సాహంతో పొంగిపోతోంది. సావిత్రి వాడిన పూవులా వాలిపోతోంది. రామలక్ష్మి అత్తారింటి కబుర్లు అంతు లేకుండా చెబుతోంది. సావిత్రి వింటోంది.

"మావారికి నాలుగు మేడలున్నాయి. పొలాలు పండు తాయి, మా అత్తగారు నన్ను ఏపని చేయనియ్యదు. నాకు పొద్దుపోదు. మీ అత్తగారు మంచిదేనా ?"

సావిత్రి నిట్టూర్చింది.

"నాకు అత్తగారు లేరు. మామగారు ఏమీ పట్టించు కోరు." అన్నది.

రామలక్ష్మి మళ్ళీవాగింది.

"మా ఆయన పట్టుచీరలే కట్టుకోమంటారు. ఎప్పుడూ మల్లెపూలే పెట్టుకోమంటారు. నాతోటే ఉంటారు. నన్ను విడచి ఉండలేరు. నేను మావూరు వచ్చేయడం ఆయన కిష్టంలేదు. మా అత్తగారు పంపింది ఈ రావిచెట్టుకు ప్రదక్షిణాలు చేయమని. ఆవిడకప్పుడే తొందర, మనుమలు కావాలని." ముసిముసి నవ్వులు నవ్వింది. సావిత్రి చిరునవ్వు నవ్వింది. మౌనంగా ఊరుకొన్నది. ఆమె ముఖంలో ఏదో నిర్లిప్తత తప్ప ఆశ నిరాశ రెండూలేవు. తుపాను వెలిసిన తరువాత వచ్చే ప్రశాంతి మాత్రం ఉన్నది. రామలక్ష్మి మళ్ళీ అడిగింది.

"నువ్వు ఎన్నాళ్ళు ఉంటావు ఇక్కడ ? నువ్వుకూడా ప్రదక్షిణాలు చేస్తావా ?"

సావిత్రి నిట్టూర్చింది.

"దేనికోసం ప్రదక్షిణాలు. నాకు ఏమీ అక్కరలేదు. మా ఆయనకు నేనంటే ఇష్టంలేదు. ఆయనకు నన్ను బల వంతంగా పెళ్ళిచేశారట. నేనింక అత్తారింటికి కూడా వెళ్ళ క్కరలేదు."

రామలక్ష్మి, "అయ్యో పాపం" అంది. అంతలో మరచిపోయింది. ఒకరి సుఖదుఃఖాలు మరి ఒకరికి అంటవు. సానుభూతి, దయ, క్షణకాలం మాత్రమే.

రామలక్ష్మి తన ఆనందంలో తాను మునిగి ఉంది. సావిత్రి దుఃఖం, బాధ ఆమెకు అర్థంకాలేదు. ఆమె తనసంగతి మాత్రమే తాను ఆలోచించుకొంటోంది.

"నీవుకూడా రారాదూ రోజూ పోనీ, నాకు తోడుగా వుంటావు" అన్నది.

సావిత్రిలో స్వార్థం అప్పుడే నశించింది. ఆమెలో కోరికలన్నీ అణగారినవి, ఆమెకు తనను గురించిన ఆలోచనే లేదు.

"అల్లాగేవస్తాను. ఎందుకు రానూ" అన్నది ఉదా సీనంగా.

కాని, మాట నిలబెట్టుకొంది. ప్రతిసారి ఆ తరువాత ఇద్దరూ కలసే వచ్చేవారు. వారిస్నేహం విచిత్రమైనది. ఎప్పుడూ రామలక్ష్మి తన సంసారం గొడవలు వడవడ వాగేది. సావిత్రి మౌనంగా వినేది. వచ్చినప్పుడల్లా రామ లక్ష్మి ఏదో క్రొత్తకోరిక కోరేది. సావిత్రి ఎన్నడూ ఏదీ కోరలేదు. రావడం మాననూలేదు.

ఎన్నిరోజులు గడిచిపోయాయో, అప్పటికీ, ఇప్పటికీ మధ్య, వారి ముఖకవళికలనుబట్టి చూస్తే ఒక జీవితకాలం గడిచి ఉండాలి.

ఇవ్వాళ వారిద్దరూ అలసిపోయినట్లున్నారు. రామలక్ష్మి ముఖంలో మొట్టమొదటిసారిగా దుఃఖం, వేదన కనిపించాయి. సావిత్రి మామూలుగానే ఉన్నది.

రామలక్ష్మి అన్నది "మా కోడలు నన్ను బొత్తిగా నిర్లక్ష్యంగా చూస్తోంది. నామాటంటేనే సరిపడదు. ఇన్నేళ్ళకి ఆయింట్లో నేను దిక్కులేనిదానిలా ఉన్నాను. ఈ అవమానం భరించలేను.." అని నిట్టూర్చింది. మళ్ళా తలపైకెత్తి నాకేసి చూస్తో అన్నది.

'ఈ రావిచెట్టుక్రింద ఎన్నిసార్లు ఎన్ని కోరికలు కోరానో, అన్ని నెరవేరాయి. ఇంక ఒక్కటే కోరిక. మా మనమడికికూడా త్వరగా పెళ్ళయి మంచి గడసరి భార్య రావాలి. అప్పుడుగాని గర్వం అణగదు మా కోడలికి. అందుకే ఎదురుచూస్తున్నాను' అన్నది.

సావిత్రి చిరునవ్వు నవ్వింది. తనూ తలెత్తి నాకేసి చూసింది.

"పాపం, ఈ చెట్టు ఎన్ని కోరికలు బాధలు, ఆశలు, నిరాశలు తనలో దాచుకున్నదో. ఎంతకాలంగా ఏమీ తెలియకుండా గంభీరంగా అల్లాగే ఉందో. కొన్ని వేల సంవత్సరాలైందేమో, లోలోపల దహించుకుపోతూ, అణగారిపోతూ. మానవు డింతకాలం ఎన్నడూ బ్రతుకలేడు. అల్పాయుః ప్రమాణమే మానవునికి ఒక వరం విముక్తి"

అన్నది. రామలక్ష్మి ఆమాటలు వినిపించుకోలేదు. ఇద్దరూ
వెళ్ళిపోయారు.

చీకటి పడింది. నక్షత్రాలు ముగ్గులు పెట్టాయి. చంద
మామ తరలివచ్చాడు గాలి కదిలింది. నా ఆకులు కొమ్మలు
గలగలలాడినవి. ఆకాశాన్నందుకోడానికి ముందుకు సాగినవి.
నాలో మళ్ళీ కోరిక తీగెలుసాగినవి. ఆకాశాన్నందుకోలేనా.
ఎప్పుడో, ఏమో. దూరాన మబ్బులు ముంచుకు వస్తు
న్నాయి. గాలి ప్రచండరూపం దాలుస్తోంది. నా స్నేహితు
రాలు గజగజలాడిపోతోంది. నా వేళ్ళు వణుకుతున్నాయి.
ఇదే ఆఖరి రాత్రి కాదుగదా.

రేపు ఈత్రోవన వెళ్ళేపిల్లలు 'పాపం ఈ రెండు
చెట్లూ రెండువేలేండ్లు బ్రతికినవి. ఇన్నాళ్ళకి కూకటివేళ్ళతో
పడిపోయాయి, అనుకుంటారు కాబోలు, అంతేకదా.